






సభా వేదిక వద్ద ఏర్పాట్లు

సమరోత్సాహం

పసుపు పండుగకు చింతలపూడి ముస్తాబైంది.. టీడీపీ కేడర్ సమరోత్సాహంతో కదులుతోంది.. తమ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు ఒకటిగా ముందడుగు వేస్తున్నారు. అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు 'రా..కదలిరా' అంటూ చంద్రబాబు పూరించే సమరభేరికి హాజరయ్యేందుకు సమాయత్తమయ్యారు.

నేడు చింతలపూడిలో రా..కదలిరా

- చంద్రబాబు సభకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలివెళ్లేందుకు కేడర్ సమాయత్తం

చింతలపూడి, ఫిబ్రవరి 4 : చింతలపూడిలో నేడు టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే 'రా.. కదలిరా' బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చింతలపూడి శివారు ఏలూరు రోడ్డు పక్కన ఆంథోని నగర్‌లో పది ఎకరాల స్థలంలో బహిరంగ సభ జరగనుంది. సభా వేదిక, ప్రాంగణంలో బారికేడ్లు, ప్రాంగణం చుట్టూ ఆశావహులు, అభిమానులు, టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. సభా ప్రాంగణం చుట్టూ ఫ్లెడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. వేదికకు 300 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నిర్మాణం పూర్తయ్యింది. పార్కింగ్ స్థలాన్ని చదును చేశారు. వీఐపీలకు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. రోడ్డు పొడవునా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలిరానున్నారు. దాదాపు లక్ష మందికి పైగా జనం కొలువు తీరే సామర్థ్యంతో సభా ప్రాంగణాన్ని ఆ పార్టీ నాయకులు తీర్చిదిద్దారు. వీరిలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల నుంచే భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చేలా పార్టీ నాయకులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా చంద్రబాబు సమక్షంలో వైసీపీ, కాంగ్రెస్ నుంచి వేరుపడి టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. హెలిపాడ్ స్థలాన్ని, బహిరంగ సభ వేదిక ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఆమె వెంట జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు టూర్ షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 1.45 గంటలకు అనకాపల్లి జిల్లా గొండుపాలెం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు చింతలపూడి శివారు ఆంథోని నగర్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.55 గంటలకు రోడ్డు మార్గంలో బయల్దేరి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు సభలో ప్రసంగం
- సాయంత్రం 4.45లకు హెలీప్యాడ్‌కు చేరుకుని తాడేపల్లిలోని ఆయన నివాసానికి బయల్దేరి వెళ్లతారు.

'రా కదలిరా' విజయవంతం చేయండి

భీమడోలు/పోలవరం/బుట్టాయగూడెం/కొయ్యలగూడెం/కామవరపుకోట : చింతలపూడిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే టీడీపీ రా కదలిరా సభను విజయవంతం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సభకు వచ్చే కార్యకర్తలు, నాయకులు ఉదయం 11 గంటలకు గుండుగొలను చేరుకోవాలని అక్కడ నుంచి భారీ ర్యాలీగా చింతలపూడి తరలి వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

చింతలపూడిలో సోమవారం జరిగే 'రా..కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్, నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఆదివారం పోలవరం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెంలో పార్టీ శ్రేణులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌ను ఇంటికి పంపడానికి సంసిద్ధంగా ఉండాలని కేడర్‌కు పిలుపు నిచ్చారు. ఈ సమావేశాల్లో బుట్టాయగూడెం మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, పోల వరం నియోజకవర్గ పరిశీలకుడు పోతుల అన్నవరం, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, కొయ్యలగూడెం మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, పోలవరం మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, మాజీ అధ్యక్షుడు పాపోలు గణపతి రత్తయ్య, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు తదితరులు పాల్గొన్నారు. రా.. కదలిరా సభకు పార్టీ పరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కామవరపుకోట మండల తెలుగుదేశం అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తూతా లక్ష్మణరావు పేర్కొన్నారు. కామవరపుకోటలో వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన కలిసి రావడంతో కేడర్‌లో నూతనోత్సాహం నెలకొందన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖాన్ వజీర్, స్వామినాథం పాల్గొన్నారు.





కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జవహర్ .. కె.కోటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ



జగన్‌ను తరిమికొట్టండి : గన్ని

చింతలపూడిలో జరగనున్న రా.. కదలిరా బహిరంగ సభ వేదిక, ప్రాంగణంలో ఏర్పాట్లను జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గపు పరిపాలనను అంతమొందించడానికి, జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి సమాయత్తంకావాలని, లేదంటే రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. ఐదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలోని పామాయిల్ రైతుల సమస్యలు పట్టించుకోలేదని, డ్రిప్ ఇరిగేషన్‌ను మూలన పడేశారని, సబ్సిడీ ఇవ్వడంలేదని, టీడీపీ హయాంలో చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతలను వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్ళల్లో కనీసం పూర్తి చేయలేకపోయిందన్నారు. రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపడానికి టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభలో చంద్రబాబు ఇచ్చే సందేశాన్ని వినడానికి వేలాదిగా ప్రజలు తరలిరానున్నారన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, టీడీపీ నాయకులు బొమ్మాజీ అనిల్, గోరుముచ్చు గోపాల్ యాదవ్, సొంగ రోషన్‌కుమార్, జె.ముత్తారెడ్డి, శ్యాం చంద్రశేషు, మారుటూరి వెంకట్రామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారు. కాగా సభా ఏర్పాట్లను మాజీ ఎంపీ మాగంటి బాబు కూడా పర్యవేక్షించారు.

ముందుకు కదలని చింతలపూడి ఎత్తిపోతలు

- రివర్స్ టెండరింగ్‌తో అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- చంద్రబాబు పైనే రైతుల ఆశలు



నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల కాల్వ

చింతలపూడి/ నూజివీడు, ఫిబ్రవరి 4 : చింతలపూడి ఎత్తిపోతల పథకం.. మెట్ట ప్రాంత రైతుల కల. నాలుగు లక్షల 85 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే ఈ పథకం వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలకు నిదర్శనంగా నిలుస్తోంది. 2006లో చింతలపూడి ఎత్తిపోతల పనులను రూ.1700 కోట్లతో మొదలు పెట్టారు. గత టీడీపీ హయాంలో ఈ పథకాన్ని విస్తరించి 4 వేల 909 కోట్లతో కృష్ణా జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందేలా ఫేజ్-1, ఫేజ్-2గా నిర్మాణాలు వేగవంతం చేశారు. 2017 సెప్టెంబరు 17వ తేదీన రూ.4,909 కోట్లతో (1, 2 ఫేజ్‌లు కలిపి) ఈ పనులకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు విస్సన్నపేట మండలం ముద్దులపర్వ వద్ద శ్రీకారం చుట్టారు. 2019 తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి ఈ పథకానికి రెండేళ్లలో రూ.3,450 కోట్లు ఖర్చు చేసి మొత్తంగా ప్రాజెక్టులో 80 శాతం పూర్తి చేసింది. టీడీపీ ప్రభుత్వం భూసేకరణతో కలిపి ఫేజ్-2కి సుమారు రూ.200 కోట్లు ఖర్చు పెట్టింది. 2019లో వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు నిలిపేశారు. మరో 1900 కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ఐదేళ్లల్లో సాగునీరు, తాగునీరు అందేది. ఫేజ్-2లో నిర్వాసిత రైతులకు కేవలం రూ.26 కోట్లు నష్ట పరిహారం చెలిస్తే పథకం పూర్తి కావడానికి అవకాశం ఉండగా, ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొమ్ములు కోసం భూనిర్వాసి తులు కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ మేరకు చంద్రబాబు రా.కదలిరా సభలో చింతలపూడి ఎత్తిపోతల పథకం గురించి భరోసా ఇస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడిని వెంటాడుతున్న సమస్యలు

చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధిలో ఇంకా వెనుకబడే ఉంది. ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ నిధులు రాకపోవడంతో రోడ్లు, అభివృద్ధి పనులు కొరవడ్డాయి. నియోజకవర్గ కేంద్రంలో వైద్యం, రోడ్లుగాని, రవాణాకు బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



చింతలపూడిలో సభాస్థలిని పరిశీలిస్తున్న మాగంటి బాబు,చాట్రాయి టీడీపీ నాయకులు



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు (ఫైల్)

హామీలు ఇచ్చారు.. జీవోలు మరిచారు!

- అంగన్‌వాడీలను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రధాన నాలుగు డిమాండ్లు నెరవేరుస్తామని చర్చల్లో హామీ
- రిటైర్మెంట్, బెన్‌ఫిట్స్‌కు సంబంధించి మాత్రమే జీవో విడుదల
- మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపు.. వేతనాల పెంపుపై కానరాని ఉత్తర్వులు
- నాయకులకు అందని చర్చల మినిట్స్ కాపీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ పెద్దల హామీ మేరకు సమ్మె విరమించిన అంగన్‌వాడీ, సిబ్బంది రెండు వారాలైనా అందుకు అనుగుణంగా జీవోలు విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డిమాండ్లలో కీలకమైన నాలుగింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అందులో ఒక దానికి సంబంధించి ఇప్పటివరకు జీవో విడుదల అయింది. మిగిలిన మూడింటికి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఇక చర్చల్లో భాగంగా డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వపెద్దలు ఇచ్చిన హామీకి సంబంధించి మినిట్స్ కాపీని అసోసియేషన్ నాయకులకు ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ రూ.1,20,000 ఇచ్చేందుకు చర్చల్లో ప్రభుత్వ పెద్దలు అంగీకరించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని, జూలై నుంచి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. వీటిలో రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్‌కు సంబంధించిన జీవో విడుదల చేశారు. మిగిలిన మూడు అంశాలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. రెండురోజుల్లోనే జీవోలు విడుదల చేస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారే గాని ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సమ్మె ప్రారంభం నుంచి చర్చల వరకు పది డిమాండ్లు అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు చర్చల్లో జరిగిన ఒప్పందానికి సంబంధించిన మినిట్స్ కాపీని యూనియన్ నాయకులకు అందిస్తామని ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు. ఇప్పటి వరకు మినిట్స్ కాపీని అందించలేదు. రెండు, మూడురోజుల్లో స్పష్టత తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు భావిస్తున్నారు.

తొందరపాటు నిర్ణయమా..?

సమ్మె విరమించిన తర్వాత ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సానుకూల స్పందన రాకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బందిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమ్మె విరమణ తొందరపాటు నిర్ణయమని ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గడం వల్లే జీవోలు విడుదల, మినిట్స్ కాపీ అందించడంలో తాత్సారం చేస్తోందంటూ పలువురు సిబ్బంది అభిప్రాయ పడుతున్నారు. ఒకసారి సమ్మె విరమించిన తర్వాత చేసేదేమి ఉండదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందే జీవో వచ్చేలా నాయకులు ప్రయత్నించాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పోలవరం, ఫిబ్రవరి 4 : ఏజెన్సీలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొండ వాగులు పొంగడంతో కొవ్వాడ కాల్వ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి వేగంగా ప్రవహించిన వరద జలాల తాకిడికి స్లూయిజ్‌కి గోదావరి నది తీరం వైపున పట్టిసీమ ఫెర్రీ రేవు వైపు గట్టు భారీ స్థాయిలో కోతకు గురైంది. గతంలో వర్షాల సీజనులో భవనానికి ఆరు అడుగుల దూరం వరకు కోతకు గురికాగా పొంచిఉన్న ప్రమాదంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. ఇటీవల వర్షాలకు మరింత కోతకు గురై భవనం వరకూ కోతకు గురవడంతో సచివాలయ, రెవెన్యూ భవనాలు ప్రమాదపుటంచుల్లోకి చేరాయి. ఈ వర్షాల సీజను వస్తే భవనాలు కాల్వలోకి పడిపోయి ఫెర్రీ రేవు భారీ స్థాయిలో కోతకు గురయ్యే పరిస్థితులు నెల కొన్నాయి. రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను అధికారులు ఇదే ప్రాంతంలో నిర్వహించడానికి సన్నా హాలు చేస్తున్న నేపథ్యంలో అధికారులు మేల్కొని కొవ్వాడ కాల్వ ఔట్ ఫాల్ స్లూయిజ్‌కి ఇరువైపులా గట్టుకి రిటైనింగ్ వాల్ నిర్మించాలని లేకపోతే భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని గ్రామ స్థులు పేర్కొంటున్నారు.





కోతకు గురైన కొవ్వాడ కాల్వ ఔట్ ఫాల్ స్లూయిజ్ గట్టు

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 : సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీవీఈవో, పరీక్షల కమిటీ జిల్లా కన్వీనర్ బి.ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 29 సెంటర్లలో 3,919 మంది, జనరల్ విభాగం ప్రాక్టికల్స్‌కు 69 సెంటర్లలో 9,898 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. సీసీ కెమెరాల నిఘాలో జరిగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఏ రోజుకారోజు ముగిసిన వెంటనే విద్యార్థి సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని వివరించారు. ప్రాక్టికల్స్ నిర్వహణపై ఎగ్జామినర్లకు ఇప్పటికే శిక్షణనిచ్చామన్నారు.

ఆవును చంపిన పెద్దపులి

- పాపికొండల అభయారణ్యం వైపుగా అడుగులు
- కొవ్వాడ ప్రాంతాల్లోని అడవి బిడ్డల భయాందోళన

5

కష్టమే మిగులుతోంది..


- నష్టాలను చవిచూస్తున్న కొబ్బరి పీచు పరిశ్రమ
- గతంలో ఉమ్మడి జిల్లాలో రూ.180 కోట్ల లావాదేవీలు
- కరోనా దెబ్బకు రూ.150 కోట్లకు పడిపోయిన వైనం
- ఆదుకోవాలంటూ పరిశ్రమల నిర్వాహకుల విజ్ఞప్తి



కొబ్బరి పీచు

దెందులూరు, ఫిబ్రవరి 4 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొబ్బరి పీచు పరిశ్రమ ద్వారా వేల మంది కార్మికులకు ఉపాధి పొందుతున్నారు. దెందులూరు, పెదవేగి, ద్వారకా తిరుమల, పెరవలి, అత్తిలి, ఉంగుటూరు, అప్పనవీడు, లింగపాలెం తదితర ప్రాంతాల్లో చిన్న తరహా కొబ్బరి పీచు పరిశ్రమలు ఉన్నాయి. పోలవరం కుడి కాల్వలో భూములు కోల్పోయిన రైతులు పలువురు వచ్చిన నష్ట పరిహారంతో కొబ్బరి పీచు పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం పీచు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమ జిల్లాలో రూ.180 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతూ ఉండేవి. నెలకు 15 టన్నుల ఉత్పత్తి చేస్తూ పరోక్షంగా ఆరు వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ కొబ్బరి పీచు ఉత్పత్తులను విశాఖ ఓడల రేవు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించేవారు కొబ్బరి పీచును ఎక్కువగా సోఫా సెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్ళు, తయారు చేయడానికి వినియోగిస్తారు. ప్రధానంగా మన రాష్ట్రం నుంచి చైనాకు కొబ్బరి పీచు ఎగుమతులు జరిగాయి. కానీ కరోనా దెబ్బకు ఇప్పటికి చిన్నపాటి పరిశ్రమ దారులు కోలుకోలేదు. ఇటీవల స్థానికంగా వీటి వినియోగం పెరగడంతో 30 శాతం ఉత్పత్తులను ఇక్కడే ఉపయోగిస్తున్నారు. అయితే కరోనా వల్ల ఎగుమతులు నిలిపోవడంతో కొబ్బరి పీచు పరిశ్రమ నిర్వాహకులు తీవ్రంగా నష్టాలను చవి చూస్తున్నారు. కొబ్బరి తోటల నుంచి కూలీల ద్వారా కొబ్బరి డొక్కలను సేకరించి పరిశ్రమల ద్వారా పీచు ఉత్పత్తి చేయగా మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచు తయారు చేయడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. కిలో పీచు తయారీకి రూ.9లు ఖర్చు అవుతుంది. కాని కరోనాలో వల్ల ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గిపోవడంతో ఒక్కొక్కసారి కిలోకు రూ.8 నుంచి రూ.9లు మాత్రమే వస్తుండడంతో నిర్వాహకులకు ఖర్చులు కూడా రావడం లేదు.

ప్రభుత్వం రాయితీ కల్పించాలి



వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమలకు విద్యుత్‌లో రాయితీ కల్పించాలి. గత ప్రభుత్వంలో విద్యుత్ బిల్లు తక్కువగా వచ్చేది. గత ప్రభుత్వం హయాంలో టన్నుకు రూ.21 వేలు వచ్చేది. కరోనా తర్వాత ఇప్పుడు టన్నుకు రూ.6 వేలు నుంచి రూ.7 వేలు మాత్రమే రావడంతో తీవ్రంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం చిన్న పరిశ్రమల దారులను ఆదు కోవాలి. కొబ్బరి పీచును చిన్న పరిశ్రమ నిర్వాహకులు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం గోదాములకు ఏర్పాటు ఆర్థిక సహకారం అందించాలి.

– గూడపాటి భీష్మ, కొబ్బరి పీచు పరిశ్రమ నిర్వాహకుడు, ధర్మరావుపేట

ముగిసిన గేట్ ప్రవేశ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ప్రవేశ పరీక్ష ఆదివారం ముగిసింది. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన పరీక్షలో ఉదయం 125 మందికి గాను 118 మంది, మధ్యాహ్నం 104 మందికి 94 మంది పరీక్షకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ పరీక్షాకేంద్రం కో-ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్ పర్యవేక్షించారు.

11న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన భీమవరంలో జిల్లాస్థాయి అండర్-7,-9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. స్థానిక అనసూయ చెస్ అకాడమీలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘ
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్‌కుమార్



రమేష్‌కుమార్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 :ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలూరుకు చెందిన కంచెర్లపల్లి రమేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజ యవాడలో ఆదివారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సందర్భంగా జరిగిన ఎన్నికల వివరాలను విలేకరులకు సంఘ నాయకులు తెలిపారు. ఇప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా వున్న సీహెచ్.కృష్ణమూర్తికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించినందున సంఘ నిబంధనల మేరకు ఆయన తన పదవినుంచి తప్పుకోగా, ఆమేరకు ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు జరిగిన ఎన్నికలో రమేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రమేష్‌కుమార్ ప్రస్తుతం ఇదే సంఘానికి ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న విషయం విదితమే. రాష్ట్ర సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎన్జీవో, రెవెన్యూ, జేఏసీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసారు.

ఆవును చంపిన పెద్దపులి

- పాపికొండల అభయారణ్యం వైపుగా అడుగులు
- కొవ్వాడ ప్రాంతాల్లోని స్థానికుల్లో భయాందోళన





ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్‌లో) పులి పాదముద్ర

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4 : ఏజెన్సీలోని మన్యం ప్రాంతం నుంచి పదిరోజుల క్రితం పులి బయట ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఆదివారం నాటికి అదేదారిలో పాపికొండల అభయారణ్యం వైపుగా మన్యం ప్రాంతానికి చేరుకుంది. ఉమ్మడి గోదావరి జిల్లా వాసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. ఆదివారం బుట్టాయగూడెం మండలం కొవ్వాడ అటవీ ప్రాంతంలో కొవ్వాడకు చెందిన కుంజం కొవ్వాడయ్య అనే గిరిజనుడికి చెందిన పాడిఆవును చంపి సగం తిని మిగతా కళేబరాన్ని వదిలేసింది. అతడు తన పశువులను ఊరికి దగ్గరలోని కొవ్వాడ కాల్వ వద్ద ప్రతిరోజు మాదిరిగా శనివారం రాత్రి కట్టేశాడు. ఈ గ్రామం అటవీ ప్రాంతానికి అతి దగ్గరగా గ్రామానికి అడవికి మధ్యలో కొవ్వాడ కాల్వ ఉంటుంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఏజెన్సీకి చేరుకున్న పులి కొవ్వాడయ్య పశువుల మందపై దాడిచేసి పాడిఆవును చంపి పక్కనే ఉన్న రాముడు జీడిమామిడి తోటలోకి లాక్కుపోయి సగం వరకు తిని మిగిలిన కళేబరాన్ని వదిలేసింది. ఆదివారం ఉదయం కొవ్వాడయ్య సోదరుడు రాజు పాలు తీసేందుకు పశువుల మందవద్దకు వెళ్లగా అవి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కొంతదూరంలో ఆవు కళేబరాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పులి దాడిచేసినట్టు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాత్రిపూట పులి దాడి చేయడంతో మిగిలిన పశువులు తాళ్లను తెంపుకుని పొలాల్లోకి పరారయ్యాయి. గ్రామస్థులు చుట్టుపక్కల వెతకడంతో చెదిరిపోయిన పశువులను గుర్తించి ఇళ్లకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ ఆపరేషన్ చేశారు. ఆవు కళేబరం వద్దకు మరోసారి పులి వచ్చి అవకాశాలు ఉన్నందున అధికారులు, సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఆవు కళేబరాన్ని చూసి గిరిజనుడు కొవ్వాడయ్య కన్నీరు మున్నీరుగా విలపించడం అందరిని కంటతడి పెట్టించింది.

వణికిపోతున్న గిరిజన గ్రామస్థులు

ఏజెన్సీ ప్రాంతం నుంచి బయట ప్రాంతాలకు వెళ్ళిన పులి తిరిగి ఆదివారం రోజున పాపికొండల అభయారణ్యం వైపుగా కనిపించింది. ఇప్పటికే పలుచోట్ల మేకలు, ఆవులు, పందిపై దాడిచేసిన పులి గమ్యస్థానానికి చేరుకునే లోపల ఇంకెన్ని పశువులను, మేకలను చంపుతుందోనంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న గిరిజనులు, కొండరెడ్లు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

జగన్ నొక్కిన బటన్‌తో రైతులకు ఉరితాడు

- ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు
- 30 గ్రామాలు, 80 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర



ఊటాడలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, తదితరులు

యలమంచిలి, ఫిబ్రవరి 4: సీఎం జగన్ బటన్ నొక్కి రైతాంగానికి ఉరితాడు వేశాడని పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆరోపించారు. జగన్ పాలనలో దగాపడిన, నష్టపోయిన రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన రైతుపోరుబాట పాదయాత్ర ఆదివారం ఉదయం ఊటాడ గ్రామం నుంచి ప్రారంభమై కాజతూర్పు, కాజపడమర, పెదమామిడిపల్లి, దిగమర్రు గ్రామాల మీదుగా కొనసాగి కొత్తపేటలో ముగిసింది. నియోజకవర్గంలో మూడు రోజులుగా 30 గ్రామాల మీదుగా 80 కిలోమేటర్ల మేర పాదయాత్ర సాగింది. పాదయాత్రలో వేలాది మంది రైతులు, మహిళలు, టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మహిళలు హారతులిచ్చి పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు సభలో జగన్ 124సార్లు బటన్ నొక్కినట్టుగా చెప్పాడని, ఆయన నొక్కిన బటన్‌తో రైతులు, అన్నివర్గాల ప్రజలు నట్టేటమునిగారని విమర్శించారు. అక్వారంగానికి విద్యుత్తు సబ్సిడీని ఎత్తివేసి సర్వనాశనం చేశాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. పాదయాత్రలో పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ జి.గాంధీభగవాన్‌రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణరాజు, బొప్పన హరికిషోర్, తాళ్లూరి బుజ్జిబాబు, మాతా రత్నంరాజు, చెరుకూరి అంజిబాబు, సిద్దిరెడ్డి అప్పారావు, బోనం చినబాబు, కడలి గోపి, తాళ్లూరి సత్యశ్రీనివాస్, నెక్కంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యమేల ?

- నెలలు గడుస్తున్నా నోటీసులతో సరి

వీరవాసరం, ఫిబ్రవరి 4: నవుడూరు జంక్షన్‌లోని నవుడూరు గ్రామ పంచాయతీ పరిధిలో గుర్తించబడిన ఆక్రమణల తొలగింపులో తీవ్రజాప్యం చోటు చేసుకుంది. నెలల తరబడి కాలయాపన సాగుతుంది. ఆక్రమణలు తొలగించమని ఫిర్యాదుదారులు స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. ఆ ప్రాంతానికి చెందిన చింతపల్లి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించమని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబరులో మొదటి ఫిర్యాదు అందించారు. దీనిపై గ్రామ పంచాయతీ స్పందించి సుమారు 40 మంది ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేసింది. వీరిలో కొందరు తమ స్థలం ఆక్రమణ కాదని అధికారులకు తెలియజేస్తున్నారు. గ్రామ పంచాయతీ సైతం నోటీసులు జారీచేసి 15 రోజుల్లోగా సంజాయిషీ, వారివద్దనున్న రికార్డులతో హాజరు కావాలని తెలిపింది. ఇంతవరకూ ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీయే కాని ఎటువంటి చర్యలు లేవని ఫిర్యాదుదారులు ఆవేదన చెందుతున్నారు. గత నవంబరులో రెండుసార్లు, డిసెంబరులో ఒకసారి, ఈ ఏడాది జనవరిలో ఒకసారి నోటీసులు జారీచేశారు. నోటీసులు ఇచ్చిన సమయం ముగుస్తుండగా ఆక్రమణల తొలగించాల్సిన అధికారులు సెలవుపై వెళ్లడం కాలవ్యవధి ముగిసిన అనంతరం విధుల్లో చేరుతునానరు. ఫిర్యాదుదారులు ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. దీనిపై చర్యలుగా ఆక్రమణల తొలగింపునకు ఫైనల్ నోటీసు అంటూ నోటీసులు జారీ చేస్తున్నారు గానీ తొలగింపు పనులు మాత్రం జరగడం లేదు.

మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

- ఆఖరి ఆదివారం.. భారీగా వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు







అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు

కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 4 : భీమవరం పట్టణంలోని మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్న సందర్భంగా ఆఖరి ఆదివారం కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఉదయంనుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకునేందుకు రావడంతో క్యూలైన్‌లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఇతర ప్రాంతాల భక్తులు రావడంతో క్యూలైన్‌లు భారీగా పెరగాయి. భారీస్థాయిలో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణను చూసేందుకు భక్తులు నిలబడిపోవడంతోపాటు ఫొటోలు తీసుకోవడంతో పందిళ్ళు రద్దీగా మారాయి. ఎటుచూసినా భక్తుల సందడే కనిపించింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులతోపాటు, ధర్మకర్తల మండలి, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాత్రి 9 గంటల ప్రాంతం వరకు రద్దీ కనిపించింది.

ఆకట్టుకున్న భరతనాట్యం

కొటికలపూడి గోవిందరావు కళావేదికపై ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన బి.సత్యకుమార్ పర్యవేక్షణలో చిన్నారులు చేసిన కూచిపూడి, జానపద నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యాలు మైమరపించాయి. మూడు గంటలపాటు సాగిన కార్యక్రమాన్ని భక్తులు ఆసాంతం తిలకించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలిపల్లికి చెందిన ఎ.తులసీమాత భగవద్గీత ప్రచార పీఠం వారిచే భగవద్గీత ప్రవచనాలు చేశారు. రాత్రి 9 గంటలకు భారీ సెట్టింగులతో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు.

'నా కుమార్తెను స్వదేశానికి రప్పించండి'



వినతిపత్రం అందిస్తున్న బాధితులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: బతుకు తెరువుకోసం ఖత్తర్ వెళ్లిన తన కుమార్తెను అక్కడ చిత్రహింసలు పెడుతున్నారని స్వదేశానికి రప్పించాలని ఆచంట మండలం చినపేటకు చెందిన బుద్దా ప్రభాకర్ కైండ్‌నెస్ సొసైటీ ఎం.డి. గట్టిం మాణిక్యాలరావుకు ఆదివారం వినతిపత్రం అందించారు. తన భార్య అనారోగ్యంతో ఉన్నప్పుడు వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తన కుమార్తె చాందినిని ఖత్తర్ పంపించామని కానీ అక్కడ గదిలో పెట్టి బంధించి చిత్రహింసలు పెడుతున్నారని వాపోయాడు. డబ్బులు కడితేనే దేశానికి పంపుతామని లేదంటే జైలులో పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు.

'విర్డ్'లో విజయవంతంగా ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్



విర్డ్ ఆసుపత్రిలో లైవ్‌లో శస్త్ర చికిత్స జరుపుతున్న వైద్య ప్రతినిధులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో 'విర్డ్ ఆర్థోప్లాస్టీ హిప్, నీకాన్ క్లేవ్ ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ విజయవంతంగా నిర్వహించారు. జాతీయస్థాయి ప్రముఖులైన 14మంది ఫ్యాకల్టీలు, 150 మంది వైద్య డెలిగేట్స్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఈనెల 3, 4వ తేదీల్లో 16 శస్త్రచికిత్సలను వారు లైవ్‌లో చేశారు. మోకాలు, తుంటికి సంబంధించి ఇన్‌ఫెక్టెడ్, రివిజన్ శస్త్రచికిత్సలను విజయవంతంగా జరిపారు. ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇటువంటి శస్త్రచికిత్సలు వైద్యులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, నైపుణ్యతను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. జాతీయస్థాయి ప్రముఖ వైద్యులు కృష్ణకిరణ్, రాజేష్‌మల్హోత్రా, విజయ్‌మోహన్, అనిల్‌థామస్, రాజ్‌కుమార్, సుమన్, శివయ్య, హేమంత్, కులకర్ణి, చంద్రశేఖర్, చెంచయ్య, వినయ్‌కిషోర్, భవ్యచంద్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

దగ్ధమైన కొబ్బరి గొడౌన్‌లో ఏఎస్పీ పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ భీమారావు

యలమంచిలి, ఫిబ్రవరి 4: ఆర్యపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన కొబ్బరి గొడౌన్‌ను అడిషనల్ ఎస్పీ భీమారావు ఆదివారం పరిశీలించారు. పూర్తిగా కాలిపోయిన గొడౌన్‌ను, పరిసరాలను ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు కొడవటి కొండయ్య సుమారు రూ.1.40 కోట్లు నష్టపోయామని ఏఎస్పీకి విన్నవించారు. పాలకొల్లు రూరల్ సీఐ కె.సతీశ్, ఎస్ఐ కె.శ్రీమన్నారాయణ ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తొలగించని మృతుల పేర్లు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: ద్వారకాతిరుమల మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం 64 పోలింగ్ కేంద్రాల్లో పూర్తయింది. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు ఇంకా కొనసాగుతున్నారు. ఇవన్నీ వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు చెందిన వారివని కొడిగూడెం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గురజాల చంద్రరావు చెబుతున్నారు. ద్వారకాతిరుమల మండలం కొడిగూడెంలో 1,441 ఓట్లు ఉన్నాయి. దీనిలో 141వ పోలింగ్ కేంద్ర ఓటర్ల జాబితాలో చాలా ఏళ్లక్రితం మృతి చెందిన పలువురు ఇంకా ఓటర్లగా కొనసాగుతూనే ఉన్నారు. ఇటీవల మృతిచెందిన టీడీపీకి చెందిన వారి ఓట్లు జాబితాలో కనిపించకపోగా ఎప్పుడో మృతిచెందిన నాగమల్లి లక్ష్మి(1113), రాచపోతు అన్నవరం (1207), కొత్తూరి భీమయ్య (973), గొటికల నాగభూషణం (1295), బాతుల గాంధీ(574) తదితరులు చనిపోయినా ఓటరు జాబితాలో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో మొత్తం ఇరవై మంది వరకు చనిపోయిన వారి పేర్లు ఇంకా ఎందుకు తొలగించలేదంటూ ప్రశ్నిస్తున్నారు.

క్రైం సమాచారం
వేర్వేరు చోట్ల ఏడుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం వేర్వేరుచోట్ల మొత్తం ఏడుగురు మృతి చెందారు. ఆచంట మండలంలో ట్రక్కు ఆటో బోల్తాపడి ఇద్దరు, ఆకివీడు మండలం ఉప్పుటేరులో దూకి యువకుడు, ఏలూరులో రైలు పట్టాలు దాటుతూ ఒకరు, దెందులూరు మండలం మేదినరావుపాలెంలో ఒకరు, ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి చెరువు వద్ద నివాసం ఉంటున్న మరొకరు, పెంటపాడు మండలంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందారు.

ట్రక్కు ఆటో బోల్తా : ఇద్దరు బాలుర మృతి

- ఆసరా ఉత్సవాల భోజనానికి వెళ్లివస్తుండగా ఘటన
- మరో ఐదుగురికి గాయాలు.. ముత్యాలవారిపాలెంలో విషాదం
- డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం





ప్రమాదంలో మృతి చెందిన బాలురు, బోల్తా పడిన ట్రక్కు ఆటో

ఆచంట, ఫిబ్రవరి 4: ట్రక్కు ఆటో తిరగబడి ఇద్దరు బాలురు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైన ఘటన కోడేరు వద్ద చోటుచేసుకున్నది. వివరాలివి.. ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు ముత్యాలవారిపాలెంకు చెందిన కుక్కల నాగరాజు చెందిన ట్రక్కు ఆటోలో నక్కా వాసుదేవ(13), మద్దాల సాయివెంకట్(12), కుక్కల విశ్వనాథం, కుక్కల కృష్ణ, నేలపూడి జయ, సుశాంత్, ఎ.నారాయణమూర్తి, నాగబాబు ఆదివారం తూర్పుపాలెంలో జరుగుతున్న ఆసరా ఉత్సవాలు నిమిత్తం వెళ్లి భోజనం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామానికి వస్తుండగా ఆచంట, కోడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో కోడేరు సమీపం వద్ద టక్కు ఆటో బోల్తా పడడంతో ఇద్దరు బాలురు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలు కావడంతో పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. మృతులిద్దరూ ఆదివారం కావడంతో సరదాగా భోజనానికి వెళ్లినట్టు తెలిసింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ప్రమాదం సంబవించిందని సమాచారం. ఘటనా ప్రాంతానికి ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ విచ్చేసి వివరాలు తెలుసుకుని బాలుర మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుటుంబ నేపథ్యం ఇలా..

నక్కా వాసుదేవ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ కోడేరు గ్రామంలో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఏసురత్నం, వీరవేణి ఇద్దరూ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మరో బాలుడు మద్దాల సాయి వెంకట్ తండ్రి శ్రీను గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి సుబ్బలక్ష్మి ఇటీవలే గల్ఫ్ నుంచి స్వదేశానికి వచ్చింది. అదే ఆటోలో తమ్ముడు నాగబాబు కూడా ఉన్నాడు. గాయాలతో బయటపడ్డాడు. గ్రామంలో విషాధచాయలు నెలకొన్నాయి.

భార్య కాపురానికి రావడం లేదని..

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : భార్య కాపురానికి రావడంలేదని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు మండలం మేధినరావుపాలెం గ్రామానికి చెందిన ములగాల రాజు (30)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమెను కాపురానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెందిన అతడు రెండు రోజులక్రితం పురుగుల మందు తాగాడు. అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై దెందులూరు ఎస్ఐ కె.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : కడుపునొప్పి బాధ భరించలేక ఓ వ్యక్తి గడ్డి నిర్మూలన మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడిచెరువు దగ్గర నివాసం ఉంటున్న బళ్ళవరపు మహేష్ (36) గత కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఆ బాధను భరించలేక ఈనెల మూడో తేదీన గడ్డిమందు తాగి అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పుటేరులో దూకి యువకుడి ఆత్మహత్య

ఆకివీడురూరల్ ఫిబ్రవరి 4 : ఆకివీడు మండలం ఉప్పుటేరులో దూకి ఆకివీడుకు చెందిన చొదిమెళ్ళ సోమశేఖర్(సోము)(24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఉప్పుటేరు వంతెనపై నుంచి ఉప్పుటేరులోకి దూకినట్టుగా స్నేహితులు తెలపడంతో అగ్నిమాపక సిబ్బంది పడవలలో గాలింపు చేపట్టారు. సోము స్థానికంగా స్వీట్‌షాపులో పనిచేస్తున్నట్టు చెబుతున్నారు. సెల్‌ఫోన్ ఇంటివద్ద వదిలి, చెప్పులు వంతెనపై వదిలేసి ఉప్పుటేరులోకి దూకినట్టు చెబుతున్నారు. ఆకివీడు పోలీసులు అతడి స్నేహితులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4:రైలుపట్టాలు దాటుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరం జిల్లా తెర్లం మండలం రాజీపేట గ్రామానికి చెందిన జామున శానపతి సూర్యనారాయణ(59) ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ దగ్గరలో ఆదివారం తెల్లవారుజామున రైల ఎపట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొంది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావుకు అందడంతో సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు.

యాచకుడి మృతి



వృద్ధుడి మృతదేహం

పెంటపాడు, ఫిబ్రవరి 4 : గుర్తుతెలియని యాచకుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పెంటపాడు ఎస్ఐ బీ.మోహన్‌రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. పెంటపాడు గ్రామంలో గత కొన్నిరోజులుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి గతనెల 28న పెంటపాడు గేటు సెంటర్ వద్ద పడిపోయాడు. స్థానికులు స్పందించి అతడిని 108 వాహనంపై తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడన్నారు. చనిపోయిన వ్యక్తికి 70 నుంచి 80 ఏళ్ల లోపు వయస్సు ఉంటుందని ప్రస్తుతం మృతదేహం ఆసుపత్రి మార్చురీలో ఉందన్నారు. ఎవరైన తెలిసిన వారుంటే 94407 96613 నంబరుకు సంప్రదించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 4 : కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఆదివారం పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో పట్టుకుని కేసు నమోదు చేశారు. అశ్వారావుపేట మండలం కన్నాయిగూడెంకు చెందిన సున్నం సురేష్ కారులో తెలంగాణ మద్యం 48 క్వార్టర్ బాటిళ్లు తీసుకెళుతుండగా ఎస్ఐ వి.చంద్రశేఖర్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. వాహనం తనిఖీ చేసే క్రమంలో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు విచారణ అనంతరం కారు, మద్యం అదుపులోకి తీసుకుని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం, ఫిబ్రవరి 4 : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బండివారిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వంచే నిషేధించబడిన నాటు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడిచేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న కార్లు, బైకులు

- 23 మంది అరెస్టు.. రూ 4.89 లక్షల నగదు, 8 కార్లు, 29 బైక్‌ల స్వాధీనం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 4: మల్లవరంలంక గ్రామంలో పొలాల మధ్య ఫ్లడ్‌లైట్ల కాంతుల్లో నిర్వహిస్తున్న కోడిపందేల బరిపై పోలీసులు దాడి చేశారు. శనివారం అర్ధరాత్రి పక్కా సమాచారంతో రూరల్ ఎస్ఐ గురవయ్య, టౌన్ ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో దాడి చేసి 23 మందిని అదుపులోకి తీసుకుని రూ.4.89 లక్షల నగదు, ఎనిమిది కార్లు, 29 బైక్‌లు, 57 కత్తులు, 26 కోడి పుంజులు, 31 సెల్‌పోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు అండదండలతో ఈ బరి నిర్వహిస్తున్నారన్న ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. పట్టుబడిన వారిలో భీమవరం, పాలకొల్లు, పాలకోడేరు, అకివీడు, టీపీగూడెం ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు ఉన్నారు. ఆకస్మికంగా పోలీసులు దాడి చేయడంతో చాలామంది చీకట్లో తప్పించుకున్నారు. గత కొంతకాలంగా గ్రామాల్లో కోడి పందేలు, జూదం విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. పట్టుబడిన అందరిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

దొంగలు పారిపోయిన
ఘటనపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : పీటీ వారెంట్‌పై ఇద్దరు దొంగలను ఏలూరు కోర్టులో హాజరుపర్చడానికి జిల్లా జైలు నుంచి ఏలూరు త్రీటౌన్ పోలీసులు కోర్టుకు తీసుకురాగా వారిద్దరూ పారిపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అంతర్ రాష్ట్ర దొంగలైన తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం రామానగర్ గ్రామం నీలాల అనిల్‌కుమార్(20), అదిలాబాద్ జిల్లా మండమర్రి గ్రామానికి చెందిన బీమిల్లి రాజ్‌కుమార్‌నాయక్ (20) అనేక దొంగతనాలకు పాల్పడగా వారు పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఏలూరు జిల్లా జైలులో ఉన్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా వీరిద్దరూ ఒక మోటారు సైకిల్‌ను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు నమోదు చేశారు. వారిద్దరిని పీటీ వారెంట్‌పై ఏలూరు కోర్టుకు హాజరుపర్చడానికి ఈనెల 3న జిల్లా జైలు నుంచి వారిద్దరినీ తీసుకురావడానికి ఎస్కార్ట్‌గా ఏలూరు త్రీటౌన్ కానిస్టేబుళ్ళు బి.హేమసుందర్, వై.రాజేష్ వెళ్ళి జిల్లా జైలు నుంచి ఏలూరు కోర్టునకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణలో ఆ దొంగలు ఇద్దరు అకస్మాత్తుగా పోలీసులను తోసివేసి దాడి చేసి గోడదూకి పారిపోయారు. వారి కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాలేదు. ఈ ఘటనపై హేమసుందర్ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

పందెంరాయుడి బైండోవర్

మునునూరు, ఫిబ్రవరి 4: లోపూడిలో కోడిపందేలు వేసేందుకు వచ్చిన వ్యక్తిని బైండోవర్ చేశామని మునునూరు ఎస్ఐ వాసు తెలిపారు. ఆదివారం లోపూడిలో కోడిపందేలు వేస్తున్నట్టు అందిన సమాచారంతో నిఘా పెట్టగా లింగపాలెం మండలం లింగపాలెంకు చెందిన దాడినబోయిన సురేష్‌తోపాటు మరికొంతమంది పందేలు వేసేందుకు రాగా మిగిలిన పరారు కాగా సురేష్ అనే వ్యక్తి పట్టుబడ్డాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలికుమారి ఎదుట హాజరుపర్చామని పూచీకత్తుపై అతడిని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



ఆర్యవైశ్య సంఘ అర్బన్ జిల్లా కమిటీ ప్రమాణస్వీకారంలో టీజీ వెంకటేశ్

ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

రూ.100 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరిన టీజీ వెంకటేశ్

ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తానని మాట ఇచ్చిందని, అది నేటికి నెరవేరలేదని ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ టీజీ.వెంకటేశ్ అన్నారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి హామీలు అమలు పరుచుకునేందుకు ముందుకు రావాలన్నారు. మన కొలనులోనే కొందరు స్వార్థపరులు కారణంగా సంఘం పేరు దెబ్బతింటుందన్నారు. సంఘం పేరుతో ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అవాంతరాలు, ఇబ్బందులు ఎదురైనా ఆర్యవైశ్యులు సంస్కృతి, సాంప్రదాయాలను నేటికి కాపాడుతున్నారన్నారు. చింతామణి నాటక ప్రదర్శన నిలుపుదల, ప్రొఫెసర్ ఐలయ్య రచించిన వివాదస్పద పుస్తకాన్ని నిలుపుదల చేయించిన ఘనత ఆర్యవైశ్య మహాసభకే చెందుతుందన్నారు. ఆర్యవైశ్యులంతా ఐఖ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు విద్య, వైద్య, రాజకీయరంగాల్లో ముందు ఉండాలని సూచించారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా దివ్వెల జయప్రకాష్ (జయబాబు), గౌరవ అధ్యక్షుడిగా గాదంశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షుడిగా మద్దుల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా వేమా సురేష్, కోశాధికారిగా బచ్చు విష్ణు, అదనపు కోశాధికారిగా దొడ్డా గోపి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలు, ఇతర కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, హోం మంత్రి, తానేటి వనిత, ఎమ్మెల్యే ఆళ్ళ నాని, టీడీపీ నేత బడేటి చంటి, జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. సీహెచ్.షణ్ముఖరావు, మహిళా అధ్యక్షురాలి రజిని, పెనుగొండ సుబ్బారాయుడు, దేవతి వెంకటేశ్వర్లు, పున్నయ్యశెట్టి దరిసి వాసు, పోతుల సురేష్, వాసవీ సుబ్బారావు, మోతే చలపతిరావు, పోరుపల్లి జయశ్రీ, కూరాళ్ళ రమాదేవి, బొందాడ రాంబాబు పాల్గొన్నారు.

దొరమామిడిలో జబర్దస్త్ కళాకారుల సందడి



బీజేపీ తరఫున ప్రచారం చేస్తున్న కళాకారులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4: దొరమామిడిలో జబర్దస్త్ కళాకారులు బీజేపీ తరఫున ప్రచారం చేయడంతోపాటు ఆటపాటలతో సందడి చేశారు. దొరమామిడి, అంతర్వేదిగూడెం, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం గ్రామాల్లో ఆదివారం పర్యటించి మోదీ ప్రభుత్వం 9 సంవత్సరాల్లో చేసిన అభివృద్దిని, 16 సంవత్సరాలుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవలను వివరిచారు. చదువుల విలువను తెలియజేస్తూ రానున్న ఎన్నికల్లో తపన చౌదరికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదిరే అభి, లాస్యప్రియ, అప్పారావు, బాబీ, వినోదిని, ఇమ్మాన్యుల్, అరుణ్ కౌండిన్య బీజేపీ నాయకులు మొడియం శ్రీనివాసరావు, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారుల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

పెదవేగి, ఫిబ్రవరి 4: వృత్తిదారులకు కేంద్రం ప్రభుత్వం అండగా ఉందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కూచింపూడిలో ఆదివారం విశ్వకర్మ కౌసల్య యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతివృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి, అనంతరం ఆర్థికంగా భరోసా కల్పించి, ఆదుకోవడమే ధ్యేయంగా బీజేపీ పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి కలిగినవారికి చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని, అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. చైతన్య ఉండవల్లి వెంకట్రావు, పొన్నూరు శంకర్ గౌడ్, వాసుదేవరావు, అనిల్ అచార్య తదితరులు పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 4: గొల్లగూడెం శివాలయంలో అసరా లబ్దిదారులకు ఆదివారం ఎమ్మెల్యే వాసుబాబు చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నల్లమాడు, గొల్లగూడెం, కంసాలిగుంట, గోపాలపురం, గోపీనాథపట్నం సర్పంచ్‌లు గౌతు రాము, మద్దిపాటి నవీన్, పుత్సకాయల విష్ణు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, దాసరి సత్యనారాయణ, పుప్పాల గోపి, మరడ వెంకట మంగారావు, ఎంపీడీవో ఆంజనేయులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 4: చేబ్రోలు పీహెచ్‌సీలో హెచ్ఐవీ బాధితులకు స్వేచ్ఛ మహిళా సంఘం అధ్యక్షురాలు ధర్మ ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారం అందించారు. కైకరం గ్రామానికి చెందిన వెజ్జు దుర్గా వెంకట సుబ్బారావు, స్వర్ణలత దంపతుల కుమార్తె అక్షర పుట్టిన రోజు సందర్భంగా ఉంగుటూరు అనాథాశ్రమంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. సర్పంచ్‌లు రాంధే రాజారావు, దిడ్ల అలకనంద, వైద్యులు కె.సుబ్బరాజువర్మ, శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా చంద్రయ్య

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా జి.చంద్రయ్య నియమితులయ్యారు. మచిలీపట్నం కమిషనర్‌గా విధులు నిర్వహించిన చంద్రయ్య ఏలూరుకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు అదనపు కమిషనర్‌గా ఉన్న బాపిరాజు మచిలీపట్నం కమిషనర్‌గా బదిలీ అయ్యారు.



నిలిచిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం



ఇసుక తిన్నెలతో ఎడారిలా కనిపిస్తున్న గోదావరి

గోదావరి.. ఎడారి

పోలవరం మండలంలో గోదావరి నీటి మట్టం తగ్గి ఇసుక తిన్నెలు పైకి తేలి ఎడారులను తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే జలాలు పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు దాటి దిగువకు చేరుకునే పరిస్థితులు లేకపో వడంతో గోదావరిలో నీటిమట్టం తగ్గి ఇసుక తిన్నెలు బయటపడ్డాయి. కొన్ని రోజుల క్రితం వరకూ గోదావరిలో నీటిమట్టం 14 మీటర్ల దిగువకు ఉండడం, ధవళేశ్వరం వద్ద కుడి ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేయడం, పోలవరం మండలంలో గూటాల, తాళ్ళపూడి మండలంలో వేగేశ్వరపురం, కొవ్వూరు మండలంలో ఆరికిరేవుల పంపింగ్ స్కీంల ద్వారా సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 46 గేట్లు పూర్తిగా మూసి కేవలం రెండు గేట్ల ద్వారా, 4 స్లూయిజ్‌ల ద్వారా నీటి విడుదల చేస్తుండడంతో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. నీటిమట్టం తగ్గడంతో పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా సరఫరా నిలిచిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వేసవిలో సత్యసాయి మంచినీటి పథకం నీటి పంపిణీకి ఇబ్బందులతో తాగునీటిపై ఆందోళన వ్యక్తమవుతోంది. - పోలవరం

బస్సు సౌకర్యం కల్పించండి

• దెందులూరు మండలంలో 5 గ్రామాలకు రవాణా సౌకర్యం లేదు • విద్యార్థులు కాలినడకన వెళ్లాల్సిందే

దెందులూరు, ఫిబ్రవరి 4: మారుమూల ప్రాంతాల్లో నేటికీ రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సిందే. సొంత వాహనం లేనివారు కాలినడకన వెళుతున్నారు. విద్యార్థులు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఏలూరు డిపోకు 25 కిలో మీటర్ల దూరంలోని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం గమనార్హం. దెందులూరు మండలం ముప్పవరం, కండ్రిక నరసింహపురం (కండ్రిగ), గండివారిగూడెం, తిమ్మనగూడెం మలకచర్ల గ్రామాలకు బస్సు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని దశాబ్దాల తరబడరి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో కండ్రిగ నరసింహపురం గ్రామానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయించారు. ఉదయం 8 గంటలు, సాయంత్రం 4 గంటలు, రాత్రి 9 గంటలకు మూడు ట్రిప్పులను కండ్రిగ నరసింహపురం వరకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయడంతో హైస్కూల్, కళాశాల విద్యార్థులతో పాటు స్థానికులకు ఉపశమనం కలిగింది. వైసీపీ పాలనలో కండ్రిగ నరసింహపురం బస్సు నిలిచిపోయింది. అధికారులకు, ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు విన్నవించినా బస్సు సౌకర్యం పునరుద్ద రించ లేదు. బస్సులు రాక, ఆటోలు సైతం తిరగని గ్రామాల్లో తిప్పలు తప్పడం లేదు. కనీసం విద్యార్థులు, వ్యాపారుల సమస్యలపై పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఉన్న సౌకర్యం కూడా నిలిపివేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏర్పాటు చేసిన బస్సు సర్వీసు ప్రస్తుత పాలనలో నిలిపివేయడానికి స్థానికులు గుర్తు చేస్తున్నారు. గ్రామా లు అభివృద్ధి చేశామని చెప్పుకునే నేతలు ఉన్న సౌకర్యాలు కొనసాగించడం పై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పేదలకు తప్పని తిప్పలు



దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు అధికంగా ఉండే గ్రామాల్లో కనీసం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం బస్సు ఏర్పాటు చేశారు. ఉన్న బస్సును తీయించి గొప్పలు చెప్పుకుంటున్న ప్రజప్రతినిధులు వెంటనే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి. రోజుకు నాలుగు సార్లు బస్సు తిరగాలి.

భీమడోలు నాగమల్లేశ్వరరావు, కండ్రిగ

విద్యార్థులు, గ్రామస్తుల కష్టాలు



అభివృద్ధిలో దూసుకుపోతున్నామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఊదరగొడుతున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పే నాయకులు మైళ్ల దూరం కాలినడకన వెళుతున్న వారిని గమనించాలి. అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ బస్సు సౌకర్యాం కల్పించక పోవడం దారుణం. గ్రామీన ప్రాంత ప్రజల సౌకర్యార్థం తక్షణం బస్సు సౌకర్యం పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టాలి.

పెనుబోయిన మహేష్ యాదవ్



సాహితీ పురస్కారం అందజేస్తున్న ఎంఎం గుప్తా, తదితరులు

కొలకలూరి ఇనాక్‌కు కృష్ణమూర్తి సాహితీ పురస్కారం

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 4: గుప్తా ఫౌండేషన్ ఏటా అందజేస్తున్న కృష్ణమూర్తి సాహితీ పురస్కారాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత, తిరుపతి ఎస్.వి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేశారు. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మదుపల్లి మోహన్ గుప్తా పురస్కారాన్ని అందజేశారు. తమిళనాడుకు చెందిన అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు రూ.25లక్షలు, శంకర్ నేత్రాలయకు రూ. 20 లక్షల చెక్కు అందజేశారు. రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి గుప్తా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనియాడారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ సూచించారు. ఆదివారం పంగిడిగూడెం హైస్కూల్‌కు వచ్చిన ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆహ్వానం పలికారు. బాల్యంలో కష్టబడి చదివి వివక్షను ఎదుర్కొని ఉప కులపతి నుంచి పద్మశ్రీ వరకు ఎదిగిన తీరును వివరించారు. హెచ్ఎం పి.సురేష్, మద్దాల పెద్దిరాజు, శిరీష, ప్రభాకరరావు, రమేశ్ తదితరులు ఆయనను సన్మానించారు.

విజ్ఞాన ఖని గ్రంథాలయం



గ్రంథ పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదవేగి, ఫిబ్రవరి 4: గ్రంథాలయం విజ్ఞాన ఖని అని గ్రంథ పాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చదువుతోపాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అంతర్లీనంగా ఉండే కళలు వెలికి వస్తాయన్నారు. చదువుతోపాటు గ్రంథపఠనం చేయడం వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందన్నారు.

వాసవి సేవాదళ్ అధ్యక్షుడు రత్నాజీకి సత్కారం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి4: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీని ద్వారకాతిరుమలలో టీడీపీ నేతలు, స్థానికులు ఆదివారం సత్కరించారు. ఆయనకు దుశ్శాలువా, గజమాలతో సన్మానించారు. కూరాకుల బుజ్జి, రేపూరి వెంకటేశ్వరరావు, గువ్వల మావుళ్లు, కొత్తపల్లి సుబ్బారావు, వీరిశెట్టి రామారావు, గువ్వల చంద్రం. గిరి, నాగు, ఫణికుమార్, తాడేపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

11న యాదవ సంఘ జిల్లా భవనం ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4: ఏలూరుజిల్లా యాదవ సంఘ భవనం ప్రారంభోత్సవం ఈనెల 11న జరుగుతుందని జిల్లా నాయకులు తెలిపారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడారు. భవన నిర్మాణం పూర్తి కావస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యాదవుల విరాళాలతో భవనం నిర్మాణం జరిగిందని వివరించారు. సమావేశంలో మల్లిపూడి రాజు, ఆకుల గంగాధర్, బొట్టా అజయ్, సంఘ నాయకులు పి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అంబేద్కర్, శివన్నారాయణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలడుగు సుశాంత్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శిగా కోటా శివన్నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ రాష్ట్ర కోశాధికారి తొమ్మండ్రు రాజబాబు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర గౌరవ సలహాదారు తుమ్మల గిరిరాజ్ మాట్లాడుతూ పాఠశాలల్లో టీచర్లకొరతను అధిగమించేందుకు వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి తెలుగు, హిందీ, ఇతర భాషల ఉపాధ్యాయ ఖాళీలు పెంచాలన్నారు. సంఘ నాయకులు శివ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సమావేశం

రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా కార్యవర్గసమావేశం ఆదివారం ఏలూరులో జరిగింది. ఉపాధ్యాయులకు సంబందించి పలు సమస్యలపై చర్చించారు. శామ్యూల్, రాము, జయప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల బోర్డు వైస్ చైర్మన్‌గా రాజు



డాక్టర్ సీఎస్.రాజు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా జాతీయ వైస్ చైర్మన్‌గా ఏలూరుకు చెందిన డాక్టర్ సీఎస్.రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీలోని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీఅయ్యాయి. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో ప్రైవేటు ఆస్పత్రుల భద్రత, ఆయుష్మాన్ భారత్ ద్వారా నగదురహిత వైద్యసేవల అమలుకు మార్గదర్శకాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంబంధిత కార్యకలాపాలు, కేంద్ర వైద్య ఆరోగ్య పథకాల అమలు, ఆస్పత్రి వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై సంబంధిత బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదు తదితర కార్యకలాపాలను ఈ బోర్డు పర్యవేక్షిస్తుంది. రెండేళ్లపాటు డాక్టర్ రాజు ఈ పదవిలో ఉంటారు. ఆయనకు పలువురు వైద్య నిపుణులు శుభాకాంక్షలు తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు, నేతలు

'పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు'

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 4: దెందులూరులో జరిగిన సిద్ధం మహాసభలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై సీఎం జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు ఖండించారు. పవరుపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జగన్ బహిరంగ సభలో చెప్పేదానికి, చేసేదానికి పొంతన లేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలు, బీసీలపై దాడులు పెరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పాలనకు ప్రజలే స్వస్తి పలుకుతారని చెప్పారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులుపెట్టడం వైసీపీకి అలవాటు అన్నారు. జనసేన నాయకులు బీవీ.రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, నగిరెడ్డి కాశీ నరేష్, నిమ్మల జ్యోతి కుమార్, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఐకమత్యంగా టీడీపీని గెలిపించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4: కాపులంతా ఐకమత్యంగా ఉండి జనసేన, టీడీపీ కూటమిని గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. కాపు సంక్షేమ మహిళా సేన నగర అధ్యక్షురాలిగా ఎస్.శ్రీదేవి ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ చేగొండ హరిరామయ్య స్ఫూర్తితో రాజ్యాధికారం సాధిద్దామన్నారు. జి.లక్ష్మి, సత్యశేఖర్, బూరగడ్డ శ్రీనాథ్, నారా శేషు, ఈశ్వరి బలరామ్, పూజారి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అధికార దుర్వినియోగం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4: వైసీపీ నిర్వహించిన సిద్ధం సభ కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఇంటర్ పరీక్షలు సైతం వాయిదా వేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందన్నారు. జనాల్ని తరలించేందుకు బస్సుల కోసం ప్రైవేటు పాఠశాలలను సైతం మూయించివేశారన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 2వేల ఆర్టీసీ బస్సులును ఉపయోగించుకుని మూడు జిల్లాల ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. 3300 మంది పోలీసులతో బందోబస్తు పెట్టి ప్రజలను అడుగడుగునా ఆటంకాలకు గురి చేశారని అన్నారు. జాతీయ రహదారి డివైడర్లను తొలగించడం దారుణమన్నారు. పార్టీ ఎన్నికల సభకు ప్రభుత్వ అధికారులను వినియోగించుకోవడం రాజ్యాంగ విరుద్దమన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వైసీపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రవి డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తీరుపై సీఐటీయూ ఖండన

జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజా సంఘాల నాయకులపై నిఘా ఉంచి నిర్బంధ చర్యలకు పాల్పడడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలను కార్మిక సంఘ నాయకులను నిర్బందించటం తీవ్రమైన చర్య అన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, ఫిబ్రవరి 4: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు అనుసరించి, అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

నూకాలమ్మకు నైవేద్యం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 4 : కొత్తపేటలో గ్రామదేవత నూకాలమ్మను ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని నైవేద్యం సమర్పించారు. తొలుత అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. పోతురాజుబాబు సన్నిధిలో కుంకుమార్చనలు జరిపారు. ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ భక్తులతో పూజలు చేయించారు. గానుగులపేట, ఆది వారపుపేట, దక్షిణపువీధి, రామచంద్రరావుపేట, పవరుపేట తదితర ప్రాం తాల్లో గల గ్రామదేవత ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, కుంకు మార్చనలు, నివేదనలతో ఆరాధించారు. కుటుంబ సమేతంగా గ్రామదేవత అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడి చెల్లించుకున్నారు.

ధన్వంతరి వైద్య భగవానుడికి అభిషేకాలు

పవరుపేట స్టేషన్ రోడ్డులో ధన్వంతరి వైద్యభగవానుడి ఆలయం వద్ద భక్తులు ఆదివారం పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. సూర్య నమస్కార పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో అర్చనలుజరిపి వనమూలికల తీర్థాన్ని అందజేసి రక్షాబంధనాలు కట్టారు.

గుడిపాడులో ఘనంగా పోలేరమ్మ జాతర

పెదపాడు, ఫిబ్రవరి 4: గుడిపాడులో పోలేరమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు, ఘంటశాల ప్రభాకరరావు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో చింతమనేని అభివాదం



తిమ్మిరెడ్డిపల్లిలో టీడీపీలో చేరిన 50 మంది దళితులు



ఏలూరులో పార్టీలో చేరిన వారికి చంటి ఆహ్వానం



ఏలూరు సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

జగన్‌ను సాగనంపడానికి

ప్రజలు సిద్ధం

వైసీపీ పాలనపై చింతమనేని ప్రభాకర్ ధ్వజం

పెదవేగి, ఫిబ్రవరి 4: అవినీతి, అక్రమాలే ఆలంబనగా కొనసాగుతున్న జగన్ ప్రభుత్వానికి ఇవి చివరి రోజులని, వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సాగనంపడానికి జనం సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వేగివాడకు చెందిన సున్నా జానకీరామ్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం టీడీపీలో చేరారు. ఎలికే ఏసురత్నం, దాసరి ప్రవీణ్, కాట్రు సత్యనారాయణ, గెల్లా ప్రసాద్, కోటా నరేష్, దాసరి విజయ్, మనుబోలు రవి, షేక్ సలీమ్, షేక్ నాగుల్ మీరా, దాసరి బాబూ రావు, వాసే సరేష్, షేక్ ఖాదర్, జొన్నకూటి నాగరాజు తదితరులను చింతమనేని పార్టీ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ జగన్ చేస్తున్న దుర్మార్గపు పాలనతో విసిగి వేసారిన నేతలు, కార్యకర్తలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందని, ఎన్నికల అనంతరం జగన్ జైలుకే అంకితమని ఆయన ఎద్దేవా చేశారు. జగన్ అండ్‌కో చేసిన అవినీతి, అక్రమాల్లో భాగస్వాములందరూ ఫలితం అందుకుంటారని ఆయన తెలిపారు. నమ్మిన అధికారమిచ్చిన ప్రజలకు చేసిన ద్రోహానికి అదే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ప్రభాకర్ అన్నారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పంది ప్రభావతి సూర్యచంద్రరావు, మాదు రవికుమార్, కొనకళ్ళ శివమణి, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఎదుటే మీడియాపై దాడిచేయడం హేయమైన చర్య అని, సీఎం జగన్ తక్షణం మీడియా ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని చింతమనేని ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిద్ధం సభలో సీఎం జగన్ సమక్షంలో మీడియా ప్రతినిధులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని ప్రభాకర్ ఖండించారు. వైసీపీ అవలంభిస్తున్న భౌతికదాడుల సంస్కృతికి ఇది తార్కాణమన్నారు. ప్రజలు చూస్తున్నారనే కనీస జ్ఞానం లేకుండా బహిరంగంగా దాడికి పాల్పడ్డారంటే వారిని ఏమనాలని ఆయన ప్రశ్నించారు. పోలవరం కుడికాలువ గట్టు మట్టిని కొల్లగొడుతున్న మట్టి మాఫియాను అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులపై జరిగిన దాడి మరువకముందే మీడియాపై దాడి చేశారంటే వైసీపీ ఎంతకు తెగించిందో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

పిరికిపంద జగన్ : బడేటి చంటి

ఏలూరు టూటౌన్: ఎన్నికల యుద్ధానికి ముందే ఓటమిని అంగీకరించిన పిరికిపంద జగన్ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. మాజీ కార్పొరేటర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందలాది మందిని బడేటి చంటి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజావ్యతిరేక సునామిలో జగన్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలను కూడా కలిసేందుకు జగన్ సుముఖత చూపడన్నారు. డివిజన్ ఇన్‌చార్జి రాజా మురళీ, తదితరులు పాల్గొన్నారు. 19వ డివిజన్‌లో పొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. డివిజన్ ఇన్‌చార్జి పైడి వెంకట్రావు నాయకత్వంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

చింతలపూడిలో సోమవారం జరిగే రా.. కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు పిలుపునిచ్చారు. 5వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అని చెప్పుకునే జగన్ వారి ఆర్థిక, సామాజిక అవసరాలు తీర్చకుండా అయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందకుండా చేయడం దుర్మార్గమన్నారు. అడిగిన వారిని గుండాలతో దాడులు చేయించి మృతదేహాలను డోర్‌డెలివరీ చేస్తున్నారన్నారు. టీడీపీ, నాయకులు, కార్యకర్తలపై ఎన్నో అక్రమ కేసులు, హత్యాప్రయత్నాలు చేసి అణచివేసే ధోరణిలో పాలన సాగిస్తున్న సైకో జగన్‌ను సాగనంపాలన్నారు. రెడ్డి ఈశ్వరరావు, విటల్, రాంబాబు, బాలరాజు, ప్రసాద్, గంగాధరం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 50 దళిత కుటుంబాలు

చింతలపూడి: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లిలో 50 దళిత కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ రెడ్డి నిరంకుశ పరిపాలన చూసి వీరంతా టీడీపీలో చేరారన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, మీరంతా చింతలపూడిలో జరిగే సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. తాళ్యారి చంద్రశేఖరరెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, మోహన్‌రావు, గంగాధరరావు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరుతూ చింతలపూడి మండలం ప్రగడవరంలో టీడీపీ సమావేశం నిర్వహించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జగన్ పరిపాలనలో అభివృద్ధి లేదని, రాజధాని లేదని ప్రజలందరికీ అర్థమైందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు. మండలంలోని ప్రధాన గ్రామాల్లో ఈ విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశాలు జరిపి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరుతూ పిలుపునిచ్చారు.



యనమల రామకృష్ణుడికి శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

యనమలను కలసిన గోపాలపురం టీడీపీ నేతలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని టీడీపీ గోపాలపురం నియోజకవర్గం నేతలు ఆదివారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితిని వివరించి పార్టీ నేతలు, కార్యకర్తలను ఐక్యం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. విషయాన్ని అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని నియోజకవర్గంలో గెలుపు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు. ద్వారకా తిరుమల శ్రీవారి ప్రసాదాలను, చిత్రపటాన్ని యనమలకు అందించారు. యనమలకు కలసిన వారిలో టీడీపీ నేతలు ఘంటా బాబ్జి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరాకుల బుజ్జి, సవలం రామకృష్ణ, రావూరి రమణ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్‌లో) పులి పాదముద్ర

ఆవును చంపిన పెద్ద పులి

- పాపికొండల అభయారణ్యం వైపుగా అడుగులు
- కొవ్వాడ ప్రాంతాల్లోని స్థానికుల్లో భయాందోళన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4 : ఏజెన్సీలోని మన్యం ప్రాంతం నుంచి పదిరోజుల క్రితం పులి బయట ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఆదివారం నాటికి అదేదారిలో పాపికొండల అభయారణ్యం వైపుగా మన్యం ప్రాంతానికి చేరుకుంది. ఉమ్మడి గోదావరి జిల్లా వాసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. ఆదివారం బుట్టాయగూడెం మండలం కొవ్వాడ అటవీ ప్రాంతంలో కొవ్వాడకు చెందిన కుంజం కొవ్వాడయ్య అనే గిరిజనుడికి చెందిన పాడిఆవును చంపి సగం తిని మిగతా కళేబరాన్ని వదిలేసింది. అతడు తన పశువులను ఊరికి దగ్గరలోని కొవ్వాడ కాల్వ వద్ద ప్రతిరోజు మాదిరిగా శనివారం రాత్రి కట్టేశాడు. ఈ గ్రామం అటవీ ప్రాంతానికి అతి దగ్గరగా గ్రామానికి అడవికి మధ్యలో కొవ్వాడ కాల్వ ఉంటుంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఏజెన్సీకి చేరుకున్న పులి కొవ్వాడయ్య పశువుల మందపై దాడిచేసి పాడిఆవును చంపి పక్కనే ఉన్న రాముడు జీడిమామిడి తోటలోకి లాక్కుపోయి సగం వరకు తిని మిగిలిన కళేబరాన్ని వదిలేసింది. ఆదివారం ఉదయం కొవ్వాడయ్య సోదరుడు రాజు పాలు తీసేందుకు పశువుల మందవద్దకు వెళ్లగా అవి కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కొంతదూరంలో ఆవు కళేబరాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పులి దాడిచేసినట్టు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాత్రిపూట పులి దాడి చేయడంతో మిగిలిన పశువులు తాళ్లను తెంపుకుని పొలాల్లోకి పరారయ్యాయి. గ్రామస్థులు చుట్టుపక్కల వెతకడంతో చెదిరిపోయిన పశువులను గుర్తించి ఇళ్లకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ ఆపరేషన్ చేశారు. ఆవు కళేబరం వద్దకు మరోసారి పులి వచ్చి అవకాశాలు ఉన్నందున అధికారులు, సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఆవు కళేబరాన్ని చూసి గిరిజనుడు కొవ్వాడయ్య కన్నీరు మున్నీరుగా విలపించడం అందరిని కంటతడి పెట్టించింది.

వణికిపోతున్న గిరిజన గ్రామస్థులు

ఏజెన్సీ ప్రాంతం నుంచి బయట ప్రాంతాలకు వెళ్ళిన పులి తిరిగి ఆదివారం రోజున పాపికొండల అభయారణ్యం వైపుగా కనిపించింది. ఇప్పటికే పలుచోట్ల మేకలు, ఆవులు, పందిపై దాడిచేసిన పులి గమ్యస్థానానికి చేరుకునే లోపల ఇంకెన్ని పశువులను, మేకలను చంపుతుందోనంటూ ఆందోళన చెందుతు న్నారు. అధికారులు మాత్రం అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న గిరిజనులు, కొండరెడ్లు జాగ్రత్తగా ఉండాలని, గుంపుగా వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

11న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన భీమవరంలో జిల్లాస్థాయి అండర్-7,-9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలి పారు. స్థానిక అనసూయ చెస్ అకాడమీలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలన్నారు.

11న యాదవ సంఘ జిల్లా భవనం ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 4: ఏలూరుజిల్లా యాదవ సంఘ భవనం ప్రారంభోత్సవం ఈనెల 11న జరుగుతుందని జిల్లా నాయకులు తెలిపారు. ఆదివారం జరిగిన విలేక రుల సమావేశంలో సం ఘ అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడారు. భవన నిర్మాణం పూర్తి కావస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యాదవుల విరాళాలతో భవనం నిర్మాణం జరిగిందని వివ రించారు. సమావేశంలో మల్లిపూడి రాజు, ఆకుల గంగాధర్, బొట్టా అజయ్, సంఘ నాయకులు పి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అంబేడ్కర్, శివన్నారాయణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) ఏలూరు జిల్లా నూతన కా ర్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్య క్షుడిగా పాలడుగు సుశాంత్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శిగా కోటా శివన్నారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ రాష్ట్ర కోశాధికారి తొమ్మండ్రు రాజబాబు వివరించారు. అనంతరం జరిగిన సమా వేశంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర గౌరవ సలహాదారు తుమ్మల గిరిరాజ్ మాట్లాడు తూ పాఠశాలల్లో టీచర్లకొరతను అధిగమించేందుకు వెంటనే డీఎస్సీ నోటిఫి కేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యా లను మెరుగుపరచడానికి తెలుగు, హిందీ, ఇతర భాషల ఉపాధ్యాయ ఖాళీ లు పెంచాలన్నారు. సంఘ నాయకులు శివ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సమావేశం

రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా కార్యవర్గసమావేశం ఆదివారం ఏలూరులో జరిగింది. ఉపాధ్యాయులకు సంబంధించి పలు సమస్యలపై చర్చించారు. శామ్యూల్, రాము, జయప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల బోర్డు వైస్ చైర్మన్‌గా రాజు



డాక్టర్ సీఎస్.రాజు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా జాతీయ వైస్ చైర్మన్‌గా ఏలూరుకు చెందిన డాక్టర్ సీఎస్.రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీలోని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీఅయ్యాయి. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో ప్రైవేటు ఆస్పత్రుల భద్రత, ఆయుష్మాన్ భారత్‌ద్వారా నగదురహిత వైద్యసేవల అమలుకు మార్గదర్శకాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంబంధిత కార్యకలా పాలు, కేంద్ర వైద్య ఆరోగ్య పథకాల అమలు, ఆస్పత్రి వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై సంబంధిత బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదు తదితర కార్యకలాపాలను ఈ బోర్డు పర్యవేక్షిస్తుంది. రెండేళ్లపాటు డాక్టర్ రాజు ఈ పదవిలో ఉంటారు. ఆయనకు పలువురు వైద్య నిపుణులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఉజ్వల'ను సద్వినియోగం చేసుకోవాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 4 : ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు కోరారు. ముదినేపల్లి మండలం పెయ్యేరు వైఎస్సార్ కాలనీలో ఉజ్వల పథకంపై మహిళలకు అవగాహన కల్పించి ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ముదినేపల్లి భారత్ గ్యాస్ ఏజెన్సీస్ మేనేజర్ ఏవీఆర్ నాయుడు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు అర్హులైన పేదలకు 170 ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరైనట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు మొవ్వ ఫణీంద్ర కుమార్, నాయకులు కొల్లిపర నాగరాజు, వత్తుమిల్లి ప్రసాద్, యర్రా నాని, జొన్నలగడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇదేనా నాడు.. నేడు

- ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిన నాడు-నేడు పనులు
- అత్యవసర విభాగంలోను అందని సేవలు
- నిలిచిన శస్త్రచికిత్సలు
- మూడేళ్లుగా ఇదే తీరు.. రోగుల గగ్గోలు

ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిం దన్న చందంగా ఉన్నాయి. మూడేళ్ళ క్రితం పనులు చేపట్టినా నేటికీ 20 శాతం కూడా పూర్తికాకపోవడంతో పాటు చేసిన పనులు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. అభివృద్ధి పనులు చేపట్టక ముందు ఈ పీహెచ్‌సీ లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, రోగులను అత్యవసర వైద్య సేవలను అందించే వారు. అయితే అభివృద్ధి పేరుతో వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఇష్టాను సారంగా పనులు చేపట్టడంతో పరికరాలన్నీ చెల్లాచెదురు చేయడంతో ఈ పీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు, రోగులకు అత్యవసర సేవలు నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

(ముసునూరు)

నాడు-నేడు పథకం కింద ఆర్అండ్‌బీ శాఖ నుంచి పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు మూడేళ్ళ క్రితం రూ. 42లక్షల నిధులను విడుదల చేశారు. పీహెచ్‌సీ లో ఆపరేషన్ థియేటర్, వార్డుల్లో సకల సౌకర్యాల కల్పన, తలుపులు, దర్వాజాలు, కిటికీల ఏర్పాటు, మురుగదొడ్లు, ఎలక్ట్రికల్ వర్క్, పాత భవనాలను తొలగింపు, మీటింగ్ హాల్ నిర్మాణం, నూతన బోరు, మోటారు



ఆపరేషన్ థియేటర్‌లో నిరుపయోగంగా సామగ్రి

ఏర్పాటు, రంగులు వేయడం తదితర పనులు చేయాల్సి ఉంది.

20 శాతం కూడా పూర్తికాని పనులు....

ఈ పీహెచ్‌సీలో నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు 20 శాతం కూడా పూర్తికాలేదు. బిగించిన తలుపులు, దర్వాజాలు, ఎలక్ట్రికల్ సామగ్రి సైతం నాసిరకంగా ఉన్నాయనే విమర్శలున్నాయి. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్ ఏడాదిన్నర క్రితం పనులు నిలిపివేశాడు. బిల్లులు రాకపోవడం వల్లే కాంట్రాక్టర్



రోగుల వార్డు ఇలా..

పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు.

మూడేళ్లుగా నివేదికలు పంపినా స్పందన లేదు..

పీహెచ్‌సీలో నాడు-నేడు పనులపై వైద్యాధికారులు మూడేళ్లుగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతూనే ఉన్నా ఫలితం లేదు. ఇటీవల ముసునూరులో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు ఈ విషయాన్ని వైద్యులు, ప్రజాప్రతినిధులు సైతం వివరించినా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ముందు చూపు లేకుండా పీహెచ్‌సీలో పనులు చేపట్టడం వల్ల అనేక ఇబ్బందులు పడుతు న్నామని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా పనులను పూర్తిచేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టెండర్ వేసేందుకు ఎవరూ రావడం లేదు...

ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిపోయిన నాడు-నేడు పనులు చేసేందుకు నూతనంగా టెండర్లు పిలిచిన ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించాం. అయితే కాంట్రాక్టర్ మాత్రం పనులు చేయనని చెప్పడంతో టెండర్లు పిలిచాం. ఈ పనులకు టెండర్ పడగానే పనులు ప్రారంభిస్తాం.

- అశోక్, ఆర్అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ, ముసునూరు మండలం

నేడు చింతలపూడిలో రా.. కదలిరా

- విజయవంతం చేయాలని నాయకుల పిలుపు

కైకలూరు, ఫిబ్రవరి 4: చింతలపూడిలో సోమవారం జరిగే రా.. కదలిరా బహిరంగ సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు కోరారు. సోమవారం ఉదయం 11 గంటలకు కైకలూరు టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా చింతలపూడి సభకు తరలివెళ్లడానికి ఏర్పాట్లు చేశామని వందలాది కార్లలో సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

నూజివీడు టౌన్: చింతలపూడిలో రా కదిలిరా సభను జయప్రదం చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ కోరారు. నూజివీడు నియోజకవర్గం నుంచి పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు భారీగా తరలివెళ్ళి చింతలపూడిలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కలిదిండి: రా...కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం కలిదిండిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ శ్రేణులను తరలించటానికి 80 వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలంతా తరలిరావాలన్నారు. ఆరు తెగలపాడు వంతెన వద్ద నుంచి వాహనాలతో ర్యాలీగా చింతలపూడిలో చంద్రబాబు సభకు తరలివెళ్తామని, టీడీపీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

చింతలపూడిలో సభాస్థలి పరిశీలన

చాట్రాయి: చంద్రబాబు రా కదలారా సభా స్థలాన్ని ఆదివారం ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబుతో కలసి టీడీపీ చాట్రాయి మండల నాయకులు పరిశీలించారు. మందపాటి బసవారెడ్డి, బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, కందుల కృష్ణ, హనుమంతరావు, లక్ష్మణరావు, ప్రభాకర్, కోటేశ్వర రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చీపురుగూడెం టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న బొట్టు వరలక్ష్మి

టీడీపీ గెలుపే లక్ష్యం..

టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, తన భర్త దివంగత బొట్టు విజయచౌదరి ఆశయం మేరకు టీడీపీని గెలిపించటమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతున్నానని పార్టీ మండల మాజీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి అన్నారు. చీపురుగూడెంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్త ఆకస్మిక మృతిని జీర్ణించుకోలేక కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నానని, ప్రజాసేవ చెయ్యాలన్న ఆసక్తి, తన కుమారుడు, ఎన్నారై బొట్టు వంశీ ప్రోత్సహిస్తుండటంతో ప్రజల మధ్యకు వస్తున్నానన్నారు. నిరంతరం టీడీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని, సోమవారం చింతలపూడిలో పార్టీ అధినేత చంద్రబాబు రా కదలిరా సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలను భారీగా తరలించి, విజయవంతం చెయ్యటానికి సమన్వయంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, దుర్గారావు, చంద్రకళ, కందుల కృష్ణ, తమ్మిశెట్టి లక్ష్మణరావు, రామదాసు, ధనలక్ష్మి, వెల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛభారత్

నూజివీడు, ఫిబ్రవరి 4: నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 వలంటీర్లు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఫ్యాకల్టీ బ్లాక్ 1, 2, 3 వద్ద పారిశుధ్య పనులు, పిచ్చిమొక్కలు తొలగింపు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. బ్లాక్ చుట్టూ ఉన్న కాలువను శుభ్రం చేశారు. కార్యక్రమంలో 100 మంది వలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -3 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.మధు తదితరులు పాల్గొన్నారు.

డాన్ బాస్కో యువజనోత్సవం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 4: డాన్ బాస్కో యువజనోత్సవాన్ని సెయింట్ పాల్స్ రీజనల్ సెమినార్ హాల్లో ఆది వారం నిర్వహించారు. ఇందులో భాగం గా నూజివీడు, తుక్కులూరు, ఈదుల గూడెం, నెప్రహాపేట విచారణకు సం బంధించి 300 మంది యువతీ యువ కులు పాల్గొనగా యువజనోత్స వాన్ని పురస్కరిం చుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక అంశా లను ప్రదర్శించారు. బైబిల్ పోటీలను నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేశారు. నూజివీడు యూనిట్ అధ్యక్షులు పిళ్లా జోజప్ప, సెక్రటరి పి.చిన్నప్ప, ప్రావెన్స్ కౌన్సిలర్ జోసఫ్, సెయింట్ పాల్స్ రీజనల్ సెమినరీ రెక్టార్ రెవరెండ్ ఫాదర్ దొంతిరెడ్డి రాజా, రెవరెండ్ ఫాదర్ జోజి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



చెక్కపల్లిలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గారపాటి రేణుక

ముసునూరు, ఫిబ్రవరి 4: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధే లక్ష్యమని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజ నేయ చౌదిరి సతీమణి రేణుక అన్నారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెక్కపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి చౌదరి 2008 నుంచి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



నీటి విడుదల పెంపు

ముదినేపల్లి, ఫిబ్రవరి 4 : ముదినేపల్లి ప్రాంతంలోని ప్రధాన పంట కాలువలకు నీటి విడుదలను పెంచారు. 'గట్టెక్కేదెలా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో నీరందక మినుము పైరు ఎండిపోతున్న అంశంపై ప్రచురితమైన కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు గుడ్లవల్లేరు లాకుల వద్ద పోల్‌రాజ్, క్యాంప్ బెల్ కెనాల్స్‌కు సుమారు 100 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. అంతకు ముందు పై రెండు కాల్వలకు 50 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసిన అధికారులు కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మినుము పైరుకు ఉపయోగపడేలా నీటి విడుదలను పెంచారు. దీంతో పై రెండు కాలువల పరిధిలో రైతులు బ్రాంచి కాలువలకు ఇంజన్లతో నీళ్ల తోడుకుని పొలాలకు పంపిణీ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోరుకొల్లు చెరువుకు తాగునీటి వంతు



తాగునీటి చెరువుకు మోటార్ పంపు సెట్‌తో నీరు తోడుతున్న దృశ్యం

కలిదిండి, ఫిబ్రవరి 4 : కోరుకొల్లులో అడుగంటిన మంచినీటి చెరువుకు తాగునీటి వంతు విడుదల చేశామని ఇరిగేషన్ ఏఈఈ సిద్ధార్థ్ తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'వాడకానికీ పనికి రావు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాగునీరు చెరువుకు మోటార్‌ల ద్వారా నీరు పెడుతున్నారని, మంచినీటి చెరువు నింపే వరకు తాగునీటి వంతు ఇస్తామన్నారు. ప్రస్తుతం సీబీ కెనాల్‌లో నీటి లభ్యత తక్కువగా ఉందని తాగునీటి చెరువును యుద్ధప్రాతిపదికన నింపుకోవాలన్నారు. అడుగంటిన తాగునీటి చెరువుకు నీటి వంతు విడుదల చేయటంలో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, గ్రామస్థులు అధికారులకు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

పందెం రాయుడు బైండోవర్

ముసునూరు, ఫిబ్రవరి 4: లోపూడిలో కోడిపందేలు వేసేందుకు వచ్చిన వ్యక్తిని బైండోవర్ చేసినట్లు ముసునూరు ఎస్ఐ వాసు తెలిపారు. ఆదివారం లోపూడిలో కోడిపందేలు వేస్తున్నట్టు అందిన సమాచారంతో నిఘా పెట్టగా లింగపాలెం మండలం లింగపాలెంకు చెందిన దాడినబోయిన సురేష్‌తోపాటు మరి కొంతమంది పందేలు వేసేందుకు రాగా మిగతావారు పరారు కాగా సురేష్ అనే వ్యక్తి పట్టుబడ్డాడన్నారు. అతనిపై కేసు నమోదు చేసి, మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలికుమారి ఎదుట హాజరుపర్చామని పూచీకత్తుపై అతనిని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



జనసేన బైక్ ర్యాలీ

కైకలూరు, ఫిబ్రవరి 4: జనసేన ఆధ్వర్యంలో ఆదివారం జనచైతన్య బైక్ ర్యాలీని నిర్వహించారు. ఆదివారం పార్టీ సమన్వయకర్త బీవీ రావు ఆధ్వర్యంలో ఆటపాక పార్టీ కార్యాలయం నుంచి కైకలూరు నియోజకవర్గంలో బైక్ ర్యాలీని చేపట్టారు. కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, తాడినాడ, ఆలపాడు గ్రామాల మీదుగా తిరిగి కైకలూరు చేరుకున్నారు. ర్యాలీలో పలువురు యువత పాల్గొన్నారు.

పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలి

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 4: రైతులకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేయాలని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పల సుందరరామయ్య డిమాండ్ చేశారు. తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నేటికీ పంటల బీమా పథకాన్ని వర్తింప చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తుఫాన్ నష్టపరిహారం త్వరితగతిన అందజేయాలని డిమాండ్ చేశారు.

రాచపట్నంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కైకలూరు, ఫిబ్రవరి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనాలకు అందరూ కృషి చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం రాచపట్నంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణలతో కలిసి ఆవిష్కరించారు. జడ్పీటీసీలు కురేళ్ళ బేబి, బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్‌లు అల్లూరి మంగారావు, ఉప్పలపాటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చేపల వ్యాపారి దుర్గాప్రసాద్ మృతి



కైకలూరు, ఫిబ్రవరి 4: కైకలూరుకు చెందిన ప్రముఖ చేపల వ్యాపారి, ఆక్వా రైతు మండలపు దుర్గాప్రసాద్ (62) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చేపల రైతుగానే కాకుండా చేపలను పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. 287 ప్రసాద్‌గా ప్రజల్లో గుర్తింపు పొందారు. ఈయన మరణవార్త విని పలువురు వ్యాపారులు, నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కైకలూరులో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబీకులు తెలిపారు.



గ్రామీణ వైద్యుల ర్యాలీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 4: నూజివీడు పట్టణంలో గ్రామీణ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి గ్రామీణ వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం విజయవాడ కామినేని ఆసుపత్రి సమీపంలో నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుల సమాఖ్య ఐక్య మహాసభకు తరలివెళ్ళారు. గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చేతిరాతలో కైకలూరు విద్యార్థిని ప్రతిభ



రోషిణి

కైకలూరు, ఫిబ్రవరి 4: చేతిరాతలో కైకలూరు విద్యార్థినికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి సాధించింది. ఆదివారం పుణేలో చేతివ్రాత పోటీల్లో కైకలూరు 9వ తరగతి విద్యార్థిని మంచిగంటి రోషిణి పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. రోషిణి కైకలూరు పంచాయతీ 9వ వార్డు సభ్యుడైన మంచిగంటి వాసు కుమార్తె కావడంతో పలువురు వ్యాపారులు, నాయకులు అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, తదితరులు అభినందించారు.





మండవల్లి మండలం మోదుగుమూడి గ్రామస్థుల ఆత్మీయ సంబరాలు

మోదుగుమూడి గ్రామస్థుల ఆత్మీయ సంబరాలు

మండవల్లి, ఫిబ్రవరి 4: మండవల్లి మండలం మోదుగుమూడి గ్రామంలో ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పిల్లలు, పెద్దలు వయోభేదం లేకుండా కులమతాలకతీతంగా పొరుగు ప్రాంతాల్లో ఉన్నవారు సైతం గ్రామానికి చేరుకుని అంతా ఆనందోత్సాహాలతో గడిపారు.